ప్రింటెడ్ చీరెలను అరికట్టాలి

● ఎంపీ చామలకు చేనేత టై అండ్ డై అసోసియేషన్ నాయకుల వినతి



భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న చేనేత నాయకులు

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 8 : పోచంపల్లి ఇక్కత్ డిజైన్ల ప్రింటెడ్ చీరెలను అరికట్టాలని, చేనేత పరిశ్రమను పరిరక్షించాలని చేనేత టై అండ్ డై అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డికి హైదరాబాద్‌లో ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చేనేత నాయకులు మాట్లాడుతూ గుజరాత్‌లోని సూరత్, బరోడా, అహ్మదాబాద్, తమిళనాడు, కేరళ ప్రాంతాల్లో ప్రింటెడ్ చీరెలు తయారవుతున్నాయన్నారు. అవి అతి తక్కువ ధరకు లభ్యమవుతుండడంతో చేనేత వస్త్రాలకు గిరాకీ లేక కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత వస్త్ర నిల్వలు పేరుకుపోతున్నాయని, వ్యాపారులు, కార్మికులు వలసలు వెళ్లే దుస్థితి నెలకొంటుందని అన్నారు. ప్రభుత్వం స్పందించి చేనేత పరిశ్రమను పరిరక్షించాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, చేనేత సంఘం రాష్ట్ర నాయకుడు తడక యాదగిరి, ఏకేఎల్‌బీ వర్తక సంఘం అధ్యక్షుడు గుండు శ్రీరాములు, నాయకుడు కొట్టం కరుణాకర్‌రెడ్డి, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కర్నాటి బాలరాజు, ఉపాధ్యక్షుడు కుడికాల రామనర్సింహ, ప్రతినిధులు బాలరాజు, రమేశ్, భవాని, కృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తాం

● భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్, డిసెంబర్ 8 : ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని కొండమడుగు గ్రామ సమీపంలో గల కేఎస్ఎన్ఆర్ గార్డెన్‌లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) జిల్లా 5వ మహాసభలను నిర్వహించారు. మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నామని, పదోన్నతులు, బదిలీలు కల్పించామని అన్నారు. పెండింగులో ఉన్న డీఏలు, పీఆర్సీ తదితర విద్యారంగ సమస్యలన్నీ విడుతల వారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ముదిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలుగా హక్కులు, బాధ్యతలు నేత్రాలుగా తమ సంఘం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగమణి, ఉపాధ్యక్షులు వెంకటాచారి, సంగు వనిత, జిల్లా కోశాధికారి ఇటికాల మల్లేశం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మెతుకు సైదులు, జిల్లా కార్యదర్శులు దొడ్డి స్వామి, రాజగోపాల్, సుధర్మారెడ్డి, ముత్యాలు, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, కంచి రవికుమార్, మమత, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జీవీ రమణారావు, సభ్యులు కరుణాకర్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ప్రతి చేనేత కార్మికుడికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం

● చేనేత, జౌళి శాఖ జిల్లా సహాయ సంచాలకుడు మహమ్మద్ కామిల్



నేతన్న బీమా చెక్కు అందిస్తున్న మహమ్మద్ కామిల్

ఆలేరు టౌన్, డిసెంబర్ 8 : ప్రతి చేనేత కార్మికుడికీ ప్రభుత్వం ద్వారా లభించే పథకాలు, సంక్షేమ ఫలాలు అందిస్తామని చేనేత, జౌళి శాఖ జిల్లా సహాయ సంచాలకులు మహమ్మద్ కామిల్ అన్నారు. ఆలేరులో చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రజా పాలన వియోత్సవాల్లో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 1,870 మంది నేత కార్మికులకు రూ.16.19 కోట్లు, నేతన్న బీమా పథకం ద్వారా రూ.1.20 కోట్లు మొత్తంగా 17.39 కోట్ల రూపాయలు విడుదలయ్యాయన్నారు. ఆసు యంత్రం సృష్టికర్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం మాట్లాడుతూ చేనేత కార్మికులకు 40శాతం యారన్ సబ్సిడీ, వర్క్ షెడ్లు, మగ్గం స్టాండ్, 50 సంవత్సరాలు నిండిన క్రార్మికులకు పెన్షన్, త్రిఫ్ట్ పథకాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం చేనేత కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం పట్టణ అధ్యక్షుడు పాశికంటి శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చింతకింది చంద్రకళ, బింగి లత పాల్గొన్నారు.

చేనేతకు రూ.వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలి

● చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాంతికుమార్

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు శాంతికుమార్

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 8 : చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం వెయ్యి కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన చేనేత పడుగు పేకల ఆత్మీయ కలయిక సందర్భంగా ఆదివారం భూదాన్ పోచంపల్లిలో చేనేత కార్మికుల గృహాలను సందర్శించి వారి జీవన స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. చేనేత పరిశ్రమ కార్మికుల ఉపాధి, సంక్షేమం, అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయాలని, త్రిఫ్ట్ ఫండ్ పథకాన్ని కొనసాగించాలని అన్నారు. చేనేత రుణాలను మాఫీ చేయాలని, చేనేత సహకార సంఘంలో నిల్వ ఉన్న వస్త్రాలను టెస్కో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నూలు రంగుల సబ్సిడీ పథకం నగదు బదిలీ కొనసాగించాలని, ఇల్లు లేని చేనేత కార్మికులకు హౌస్ కం వర్క్ షెడ్ పథకాన్ని పునరుద్ధరించాలని, ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. పాలక ప్రభుత్వాల లోపభూయిష్ట విధానాల వల్ల చేనేత వృత్తి సంక్షోభంలో కూరుకుపోయి ఉపాధి కరువై వలసలు వెళ్లే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 15న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే చేనేత పడుకు పేకల ఆత్మీయ కలయిక కార్యక్రమానికి చేనేత నాయకులు, కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, రాష్ట్ర నాయకులు చింతకింది రమేశ్, కూరపాటి రమేశ్, ఏలె భిక్షపతి, చేనేత టై అండ్ డై అధ్యక్షుడు భారత లవకుమార్, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు అంకం పాండు, మాజీ అధ్యక్షుడు మంగళపల్లి శ్రీహరి, ఉపాధ్యక్షుడు భారత భూషణం, ప్రధాన కార్యదర్శి హరిశంకర్, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నాయకులు

వలిగొండ, డిసెంబర్ 8 : ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తానా యాదగిరి ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులకు నెలకు రూ.25వేల పెన్షన్, 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ నాయకులు సంగిశెట్టి క్రిష్టఫర్, రమేశ్, గాజుల యాదగిరి, మిర్యాల సుగుణమ్మ, ప్రపుల్ల రాంరెడ్డి, చంద్రశేఖర్‌ప్రసాద్, లింగయ్య, మాధవి, సత్తయ్య, లక్ష్మయ్య, వెంకటేశం, యాదయ్య పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో భక్తుల సందడి

క్యూ కాంప్లెక్స్‌లో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, డిసెంబర్ 8 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొన్నది. సెలవు కావడంతో స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తిరుమాఢవీధులు, క్యూ కాంప్లెక్స్ సందడిగా మారాయి. క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణకట్ట, బస్టాండ్, శివాలయం భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారి ధర్మ దర్శనానికి 2గంటలు, వీవీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. ప్రధానాలయ ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చన జరిపారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువారాధన చేపట్టి, స్వామి, అమ్మవారు, క్షేత్రపాలకుడికి సహస్రనామార్చన జరిపారు. స్వామి, అమ్మవార్ల శయనోత్సవ సేవను విశేషంగా జరిపి ద్వారబంధనం గావించారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 35వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.63,17,011 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

జిల్లాలో మోస్తరు వర్షం

భువనగిరి కలెక్టరేట్ : జిల్లాలోని పలు మండలాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా బొమ్మలరామారం మండలంలో 93 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మోత్కూరు మండలంలో 77.3 మిల్లీమీటర్లు, మోటకొండూరులో 64.5, యాదగిరిగుట్టలో 63.5, తుర్కపల్లిలో 58.3, రాజాపేట, ఆలేరు మండలాల్లో 48.3, ఆత్మకూరు(ఎం)లో 44.3, బీబీనగర్‌లో 31, అడ్డగూడూరులో 22, గుండాలలో 19.3, భువనగిరిలో 12.3, వలిగొండ మండలంలో 4.5మి.మీ. చొప్పున వర్షం కురిసింది.

బసవలింగేశ్వర పద్మశాలీ సంఘం కమిటీ ఎన్నిక

భూదాన్ పోచంపల్లి : మున్సిపాలిటీ పరిధిలోని బసవ లింగేశ్వర పద్మశాలీ సంఘం నూతన కమిటీని సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కర్నాటి పురుషోత్తం, గుండు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేముల ఏలేందర్, ఉపాధ్యక్షుడిగా వలందాస్ నరేందర్, ప్రధాన కార్యదర్శిగా పగడాల నరేశ్, సహాయ కార్యదర్శులుగా కర్నాటి లక్ష్మి, కొంగరి నాగమణి ఎన్నికయ్యారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

భూదాన్ పోచంపల్లి : పట్టణంలోని పద్మశాలీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్లోబల్ కంటి హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో చేనేత టై అండ్ డై అధ్యక్షుడు భారత లవకుమార్, పద్మశాలీ చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, చేనేత జన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చింతకింది రమేశ్, ఉపాధ్యక్షుడు భూషణం, ప్రధాన కార్యదర్శి హరిశంకర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు సాట్ల బాలయ్య మృతిచెందారు. ఆయన కుటుంబానికి వీరాంజనేయ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రూ.65వేల ఆర్థిక సాయం అందించారు. సంఘం నాయకులు బాలరాజు, అంజయ్య, యాదయ్య, గాలయ్య, వెంకటేశం, లక్ష్మయ్య, యాదయ్య, గోపాల్ పాల్గొన్నారు.

వలిగొండ : మండలంలోని మొగిలిపాక గ్రామానికి చెందిన జడిగి నర్సింహ అనారోగ్యంతో మృతిచెందాడు. ఆదివారం ఆయన మృతదేహానికి బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు, మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్‌రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. నర్సింహ కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పాల సంఘం చైర్మన్ భిక్షపతి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ జడిగె భిక్షపతి, నాయకులు నర్సింహ, శంకరయ్య, సత్యనారాయణ, గోపాల్, మశ్చేందర్, నరేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఏడాది పాలనలో చేసిందేమీ లేదు

● మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

చౌటుప్పల్, డిసెంబర్ 8 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడస్తున్నా చేసిన అభివృద్ధి ఏమీ లేదని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. పట్టణంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, గిట్టుబాటు ధర, బోనస్ విషయంలో రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ధరణి సమస్య ఇంతవరకూ పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. మహిళలకు రూ.2,500 పెన్షన్ ఎక్కడ పోయిందని ప్రశ్నించారు. గ్యాస్ సబ్సిడీ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని రంగాలను ధ్వంసం చేస్తుందని విమర్శించారు. ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతూ పబ్బం గడుపుకొంటుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభల్లో ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి ప్రజా సమస్యలపై తీర్మానాలు చేసుకొని ప్రజా పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు. ఈ నెల 15న చౌటుప్పల్‌లో భారీ బహిరంగ సభ, 16, 17 తేదీల్లో నిర్వహించే ప్రతినిధుల సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, నాయకులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనూరాధ, బూరుగు కృష్ణారెడ్డి, పాషా, నర్సింహ, మధుకృష్ణ, కిష్టయ్య, బాలయ్య, నందీశ్వర్, యాదయ్య పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకును ఏర్పాటు చేయాలి



పద్మశాలీ కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

రామన్నపేట, డిసెంబర్ 8 : మండల కేంద్రంలోని పద్మశాలీ కాలనీలో వాటర్ ట్యాంకును ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు కందుల హన్మంతు, పట్టణ కార్యదర్శి మునుకుంట్ల లెనిన్ కోరారు. మండల కేంద్రంలోని పద్మశాలీ కాలనీలో ఆదివారం ఇంటింటికీ సీపీఎం కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 15, 16, 17 తేదీల్లో చౌటుప్పల్‌లో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అప్పం లింగస్వామి, గొరిగె సోములు, గాదె నరేందర్, సత్యం, వెంకటేశ్వర్, వెంకన్న, సంతోష్, అశోక్ పాల్గొన్నారు.

రెడ్లరేపాకలో కంఠమహేశ్వరస్వామి బోనాలు

కంఠమహేశ్వర స్వామి బోనాల ఊరేగింపులో భక్తులు

వలిగొండ, డిసెంబర్ 8 : మండలంలోని రెడ్లరేపాక గ్రామంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో కంఠమహేశ్వరస్వామి బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను పసుపు, కుంకుమలతో అలంకరించి డప్పుచప్పుళ్లు, శివసత్తుల ఆటపాటలతో ఊరేగింపుగా వెళ్లి మహేశ్వరస్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు జువ్వగాని స్వామిగౌడ్, నాయకులు సత్యనారాయణ, శంకర్‌గౌడ్, శ్రీనివాస్, సుమన్ గౌడ్, అనిల్, భిక్షపతి, లచ్చయ్య, నరసింహ పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తున్న ఐదుగురి అరెస్ట్

చౌటుప్పల్ రూరల్, డిసెంబర్ 8 : మండలంలోని దేవులమ్మ నాగారం గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై విశ్వసనీయ సమాచారం మేరకు భువనగిరి ఎస్ఓటీ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు పందెం రాయుళ్లను అరెస్ట్ చేశారు. 4 పందెం కోళ్లు, 45 కోడి కత్తులు, రూ.6వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

'సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి'

వలిగొండలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

బొమ్మలరామారం, డిసెంబర్ 8 : చౌటుప్పల్‌లో ఈ నెల 15, 16, 17 తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దాసరి పాండు కోరారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలకు ముఖ్య అతిథులుగా సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, జూలకంటి రంగారెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. ప్రజలు, కర్షకులు, కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, నాయకులు సాయి, సత్యనారాయణ, బాలనర్సింహ, బ్రహ్మచారి, నర్సింహ, రమేశ్ పాల్గొన్నారు.

వలిగొండలో బైక్ ర్యాలీ

వలిగొండ : సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని మండల కేంద్రంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాటూరి బాలరాజు మాట్లాడుతూ మహాసభలు, బహిరంగ సభకు మండలం నుంచి పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. బైక్ ర్యాలీలో సీపీఎం నాయకులు మద్దెల రాజయ్య, సిర్పంగి స్వామి, తుర్కపల్లి సురేందర్, మెరుగు వెంకటేశం, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, సత్తిరెడ్డి, కిష్టయ్య పాల్గొన్నారు.

మహాసభల కరపత్రం ఆవిష్కరణ

ఆత్మకూరు(ఎం) : సీపీఎం జిల్లా మహాసభల ప్రచార కరపత్రాలను మండల కేంద్రంలో ఆదివారం విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం, జిల్లా నాయకుడు రచ్చ గోవర్ధన్, గ్రామ శాఖ కార్యదర్శి రాచమల్ల సత్తయ్య, నాయకులు సత్యనారాయణరెడ్డి, మల్లేశం, భిక్షపతి పాల్గొన్నారు.

మోత్కూరు : మండలంలోని పాటిమట్లలో సీపీఎం మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, మండల నాయకులు కురిమేటి యాదయ్య, రేగటి అశోక్, కురిమేటి సుగుణమ్మ, యాదయ్య, సోమయ్య, అవిలమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట, డిసెంబర్ 8 : మండలంలోని చొల్లేరు గ్రామం నుంచి జమ్మాపురం వరకు ఏండీఎఫ్ నిధుల కింద మంజూరైన బీటీ రోడ్డు పనులకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదివారం శంకుస్థాపన చేశారు. చొల్లేరు గ్రామంలో మొదటగా గ్రామ దేవతకు పూజలు నిర్వహించిన అనంతరం బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చైతన్యారెడ్డి, మాజీ ఎంపీపీ చీరె శ్రీశైలం, మాజీ ఎంపీటీసీ కొక్కలకొండ అరుణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గారూ.. ప్రజాపాలనంటే ఇదేనా?

● శంకుస్థాపన చేసిన పనులకు మళ్లీ శంకుస్థాపనా : మాజీ జడ్పీటీసీ అనూరాధ



చొల్లేరులో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ అనూరాధ, మాజీ సర్పంచ్ బీరయ్య

యాదగిరిగుట్ట, డిసెంబర్ 8 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరై శంకుస్థాపన చేయగా, తామే మంజూరు చేశామంటూ మళ్లీ శంకుస్థాపన చేయడమేంటని మాజీ జడ్పీటీసీ తోటకూరి అనూరాధ, మాజీ సర్పంచ్ తోటకూరి బీరయ్య అన్నారు. ప్రజాపాలన అంటే ఇదేనా? అని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను ప్రశ్నించారు. మండలంలోని చొల్లేరు గ్రామంలో గత ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి శంకుస్థాపన చేసిన శిలాఫలకం వద్ద ఆదివారం విలేకరులతో వారు మాట్లాడారు. గత ప్రభుత్వంలో డీఎంఎఫ్ కింద మంజూరైన రూ.1.50 కోట్లతో పనులు చేపట్టాల్సిన చొల్లేరు నుంచి జమ్మాపురం బీటీ రోడ్డును స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదివారం తిరిగి శంకుస్థాపన చేయడాన్ని వ్యతిరేకించారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. చిత్తశుద్ధి ఉంటే గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని, వాటికి నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేస్తే బాగుంటుందని హితవు పలికారు. డీఎంఎఫ్ నిధులను మైనింగ్ ద్వారా సేకరిస్తారని తెలిపారు. వీటికి సర్వ హక్కులు జిల్లా కలెక్టర్‌కు ఉంటాయని, ఒకసారి మంజూరైన నిధులను మార్చే వీలుండదని అన్నారు. ఇటువంటి వాటిని తాను తీసుకొచ్చానని చెప్పి ప్రజలను తప్పదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. గతంలో ప్రొసీడింగ్‌కు మాత్రమే పరిమితమయ్యారని ఎమ్మెల్యే మాట్లాడటం అవగాహన రాహిత్యమేనన్నారు. గతేడాది సెప్టెంబర్ 30న అప్పటి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి నిధులు మంజూరు చేస్తూ ఇచ్చిన జీఓ ఇందుకు సాక్ష్యమని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోనే శంకుస్థాపన చేసి, టెండర్లు పూర్తి చేశారని, ఎన్నికలు రావడంతో పనులు చేపట్టడంలో జాప్యం జరిగిందని అన్నారు. అంతా ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారని హెచ్చరించారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ నర్సయ్య, మాజీ ఉప సర్పంచ్ వద్దిగళ్ల బాబు, బీఆర్ఎస్ నాయకులు గవ్వల భాస్కర్, చిన్నం శ్రీకాంత్, మధు, బాలరాజు, మల్లారెడ్డి, శ్రీధర్, స్వామి, శ్రీశైలం, పుండరీకం పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

● గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు నర్సింహ

సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ

చౌటుప్పల్, డిసెంబర్ 8 : గొర్రెల పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు బండారు నర్సింహ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గొర్రెల పంపిణీ పథకాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ప్రకటించి ఏడాది గడిచినా అమలు చేయడం లేదన్నారు. పశువుల దవాఖానల్లో కనీసం నట్టల నివారణ